క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శనీశ్వరుడి జయంతి



పూజలందుకుంటున్న శనీశ్వరుడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో కొలువైన శనీశ్వరుడికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శని జయంతి సందర్భంగా అర్చకులు అశ్వినీ కుమార్, మహేష్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేయించారు. భక్తులతో గ్రహదోష పరిహారార్థం పూజలు చేయించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ముగిసిన ఈఏపీసెట్ పరీక్షలు



వెంకటేశ్వర కాలేజీ వద్ద హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 19 నుంచి నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీ సెట్ – 2025 పరీక్షలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు సోమవారం చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజీలో 280 మందికి గాను 271 మంది, ఎచ్చెర్ల శ్రీవెంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజీలో 168 మందికి గాను 161 మంది హాజరయ్యారు. రెండు కేంద్రాల్లో హాజరు పరిశీలిస్తే ఇప్పటి వరకు శ్రీశివానీలో 224 మంది, శ్రీవెంకటేశ్వరాలో 125 మంది గైర్హాజరయ్యారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

ఎచ్చెర్ల: లావేరు మండలం మురపాకలో మంగళవారం బోర్లకు మరమ్మతులు చేపట్టారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా బోర్లను బాగు చేయిస్తున్నట్లు సర్పంచ్ పెయ్యల నాగమణి తెలిపారు.

గోవిందరావు కుటుంబానికి పరామర్శ



గోవిందరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న బెల్లాన చంద్రశేఖర్

జి.సిగడాం: వైఎస్సార్ సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు, వాండ్రంగి మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఈసర్ల గోవిందరావు తల్లి ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ గ్రామానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ సమస్యలపై దృష్టిపెట్టాలి



మాట్లాడుతున్న తహశీల్దార్ సరిత

జి.సిగడాం: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ ఎం.సరిత సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నీటితీరువా వసూళ్లపై దృష్టి పెట్టాలన్నారు. రైతు రుణాల రెన్యువల్‌కు సంబంధించి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీటీ ఎన్.నిర్మల, ఆర్ఎస్‌డీటీ గాయత్రి, ఆర్ఐ ఆబోతుల రాధ, భూపతి నర్సింగరావు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని వక్తలు పేర్కొన్నారు. యోగా మాసోత్సవంలో భాగంగా ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. యోగా ఆవశ్యకతను వివరిస్తూ యోగా అండ్ ఫిట్‌నెస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో యోగాసనాలు సాధన చేశారు. కార్యక్రమంలో వీసీ రజని, రెక్టార్ అడ్డయ్య, రిజిస్ట్రార్ సుజాత పాల్గొన్నారు.

విజయగణపతికి విశేష పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు.

విజ్ఞానం.. వికాసం

- గ్రంథాలయాల్లో కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు
- సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసం పెరిగేలా అవగాహన
- జూన్ 6 వరకు నిర్వహణ



తాము గీసిన చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్ :

చిన్నారుల్లో సృజనాత్మకత పెంచేందుకు గ్రంథాలయాలు వేదికగా నిలుస్తున్నాయి. వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేసుకోకుండా గ్రంథాలయ సంస్థ కొద్దిరోజులుగా వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తోంది. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేలా సరికొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. తెలుగు పద్యాలు, స్పోకెన్ ఇంగ్లీష్, నీతి కథలు, బొమ్మలు వేయడం, యోగా, పలు క్రీడాంశాలు తదితర అంశాలపై గ్రంథాలయాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.

45 రోజుల పాటు నిర్వహణ..

గతంలో పెద్దలతో పాటు పిల్లలు కూడా తరచూ గ్రంథాలయాలకు వెళ్లేవారు. టీవీ, సెల్‌ఫోన్‌లు రావడం, సోషల్ మీడియా వాడకం పెరగడంతో ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. గ్రంథాలయాలకు వచ్చే పాఠకుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. ముఖ్యంగా చిన్నారుల్లో చాలామందికి అసలు గ్రంథాలయాలు అంటే ఏంటో తెలియని పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో పుస్తక పఠనం, ఇతర అంశాలపై ఆసక్తి పెంపొందించేందుకు మే 28 నుంచి జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. నగరానికి సంబంధించి కేంద్ర గ్రంథాలయంలో 40 మంది, బలగ శాఖా గ్రంథాలయంలో 30 మంది చిన్నారులు శిక్షణకు హాజరవుతున్నారు. జూన్ 6వ తేదీ వరకూ అంటే 45 రోజుల పాటు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయి. చిన్నారులకు తెలుగు పద్యాలు, చందమామ కథలు, శతక పద్యాలు, చిత్రలేఖనం, గణిత సూత్రాలు, స్పోకెన్ ఇంగ్లీషు, ఇంగ్లీషు గ్రామర్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. వివిధ క్రీడాంశాలైన క్యారమ్స్, చదరంగం, ధ్యానం, యోగా తదితర అంశాలలో మెలకువలు నేర్పిస్తున్నారు. వారాంతపు పరీక్షలు నిర్వహించి వాటిలో ప్రతిభ కనబరచిన వారికి పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, కంపాస్ బాక్స్‌లు వంటివి బహుమతులుగా అందజేసి వారిని ప్రోత్సహిస్తున్నారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహం:

వేసవి విజ్ఞాన శిబిరాలకు చిన్నారులు వెళ్ళే విధంగా వారి తల్లిదండ్రులూ ప్రోత్సహిస్తున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహిస్తున్న ఈ తరగతులకు ఆయా గ్రంథాలయాలలో సుమారుగా 30 నుంచి 40 మంది చిన్నారులు శిక్షణ పొందుతున్నారు. చదువుతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించే యోగా నేర్పిస్తున్నారు. ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, సామాజిక సేవా కార్యకర్తలతో పలు అంశాలలో అవగాహన, చిత్రలేఖనం, క్రాఫ్ట్ బొమ్మల తయారీపై అవగాహన కల్పిస్తున్నారు. శిక్షణకు వచ్చిన విద్యార్థులకు తాగునీరు, శీతల పానీయాలు, స్నాక్స్ అందిస్తున్నారు.

పుస్తక పఠనంతో మేధోశక్తి:

విద్యార్థులలో పుస్తక పఠనంతో మేధోశక్తి పెరుగుతుందని జిల్లా గ్రంథాలయ అధికారి బుర్రి కుమార్ రాజు, బలగ గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన అన్నారు. విద్యార్థులకు పరిసరాలు పరిశుభ్రత, మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలు, నీటి సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎండ తీవ్రత నుంచి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఆసక్తి పెరిగింది..



స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్‌లో మెలకువలు నేర్పడంతో సులువుగా నేర్చుకుంటున్నాను. యోగ, ధ్యానం నేర్పించడంతో మానసికంగా, ఉల్లాసంగా ఉంటున్నాం.

– జి.రమ్య, 8వ తరగతి, ఎంసీహెచ్ స్కూల్, బలగ

శిక్షణ బాగుంది..



చదువుతోపాటు యోగా, ధ్యానం, బొమ్మలు గీయడంతో పలు క్రీడాంశాలలో మెలకువలు నేర్పిస్తున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ శిక్షణ ఏర్పాటు చేయడం సంతోషకరం.

– చరిష్మా, 8వ తరగతి

విషయ పరిజ్ఞానం..



వేసవి సెలవుల్లో గ్రంథాలయానికి రావడం వల్ల ఎన్నో విషయాలను తెలుసుకుంటున్నాను. కొత్త అంశాలు నేర్చుకోవాలనే ఉత్సాహం ఇంకా ఎక్కువ అవుతోంది.

– కె.ఈశ్వరసాయి, 9వ తరగతి, ఎంసీహెచ్ స్కూల్, బలగ

సృజనాత్మకత..



వేసవి శిక్షణా శిబిరాలతో చిన్నారుల్లో సృజనాత్మకత, పోటీతత్వం పెరుగుతుంది. చదువుతో పాటు ఇతర అంశాలలో శిక్షణ ఇస్తుండడం వలన విద్యార్థుల్లో ఉత్సాహం కనిపిస్తోంది.

– బుర్రి కుమార్‌రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి



విద్యార్థులకు నీతికథలు చెబుతున్న దృశ్యం



చిన్నారులకు ఆటలు ఆడిపిస్తూ..

రమాబాయి జీవితం స్ఫూర్తిదాయకం



రమాబాయి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సతీమణి రమాబాయి భీమ్‌రావ్ అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకమని ఏఐఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను, జిల్లా దళిత సంఘాల జేఏసీ అధ్యక్షుడు డాకంత వేణు అన్నారు. ప్రజల కోసం జీవితాన్ని ధారపోసిన మహనీయుడు అంబేడ్కర్ అయితే.. ఆయన సాధించిన విజయాలకు అండగా నిలిచిన ధీర వనిత రమాబాయి అని పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం రోడ్డులో ఉన్న పూలే పార్కులో రమాబాయి విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐఎం, దళిత, బహుజన జేఏసీ నాయకులు పురుషోత్తం, రాంబాబు, కొత్తూరు సత్యనారాయణ, సాకేటి నాయుడు, పెయ్యల చంటి, నాగరాజు, అప్పన్న, రాము, అబ్బాస్ పాల్గొన్నారు.

‘ఆనంద’మానందమాయె..!



ముర్రాట్లతో బారులు తీరిన భక్తులు



ఆకట్టుకున్న వేషధారణలు

జి.సిగడాం మండలం ఆనందపురంలో మంగళవారం చంద్రమాణిక్యాలమ్మ తల్లి సంబరాలు అంబరాన్నంటాయి. అమ్మవారిని రథంపై ఊరేగింపుగా తీసుకెళ్లారు. మహిళలు ముర్రాట్లతో వెళ్లి అమ్మవారికి చల్లదనం చేసి మొక్కులు తీర్చుకున్నారు.

– జి.సిగడాం

కానిస్టేబుల్ మృతికి సంతాపం



లోకేష్(ఫైల్)

జి.సిగడాం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వల్లంశెట్టి లోకేష్(38) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఇతని స్వగ్రామం విజయనగరం జిల్లా జామి మండలం అట్టాడ. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతిచెందారు. లోకేష్‌కు భార్య అచ్చయ్యమ్మ, కుమారుడు దివిన్, కుమార్తె భవిశ్రీ ఉన్నారు. లోకేష్ మృతి పట్ల రణస్థలం సీఐ అవతారం, ఎస్ఐ వై.మధుసూదనరావు, ఏఎస్ఐలు పాగిరి శంకరరావు, కోరుకొండ రామకృష్ణ, సిబ్బంది సంతాపం తెలిపారు.

యోగ సాధన తప్పనిసరి

ఎచ్చెర్ల: ప్రతి విద్యార్థి యోగా చేయాలని యోగా శిక్షకులు శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా లావేరు శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో గ్రంథాలయంలో ప్రతిరోజూ విద్యార్థులతో యోగా సాధన చేయిస్తున్నట్లు తెలిపారు.

పశుపోషణకు పాట్లు

- పశుగ్రాసం లేక ఇబ్బందులు
- కానరాని నీటి కుంటలు
- ఆందోళనలో పాడి రైతులు



చుక్క నీరు లేకుండా ఎండిపోయిన చెరువులో గొర్రెలు, మేకలు



బోరు వద్ద దాహం తీర్చుకుంటున్న మూగజీవి

జి.సిగడాం : ఓవైపు మండుతున్న ఎండలు, మరోవైపు పశుగ్రాసం కొరత, ఇంకోవైపు నీటికుంటల లేమితో పశుపోషణ భారంగా మారుతోంది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వాగులు, చెరువులు కొన్ని నెలల క్రితమే ఇంకిపోయాయి. దీంతో పాడి పశువులు, దుక్కిటెద్దులు, గొర్రెలు, మేకలు వంటి వాటికి తాగునీరందని దుర్భర స్థితి నెలకొంది. జి.సిగడాం మండలంలో సుమారు 15 వేల వరకు ఆవు, గేదెజాతి పశువులు ఉన్నాయి. 40వేల వరకు గొర్రెలు, మేకలు ఉన్నాయి. వీటిపై ఆధారపడి 5200 కుటుంబాలు జీవనాధారం సాగిస్తున్నాయి. మండల పరిధిలో 460కుపైగా చెరువులు, బందలు, రెల్లిగెడ్డ, సారథిగెడ్డలు ఉన్నాయి. ఇవి గతంలో మండువేసవిలోనూ నీటితో కళకళలాడేవి. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాది సంక్రాంతికి ముందే ఎండిపోయాయి. 1250 వరకు వ్యవసాయ బావులు ఉండగా అవి కూడా అడుగంటిపోయాయి. ఈ నేపథ్యంలో పశుపోషణకు అందుబాటులో నీరు లేక పాడిరైతులు అవస్థలు పడుతున్నారు. చాలామంది రైతులు పశువులను విక్రయించాల్సిన పరిస్థితి దాపురించింది.

స్పందించని పాలకులు..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి గ్రామంలోను అధిక సంఖ్యలో నీటి కుంటలు నిర్మించి తాగునీటి వనరులు కల్పించాల్సి ఉన్నా ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. కరువు సహాయక చర్యల్లో భాగంగా ఇటువంటివి సకాలంలో పట్టించుకోకపోవడంపై పాడి రైతులు మండిపడుతున్నారు. కోట్లాది రూపాయలతో చేపడుతున్న ఉపాధి పనుల్లో చాలా వరకు ప్రజోపయోగంగా ఉండటం లేదని, నీటి కుంటలు నిర్మిస్తే పశువులకైనా ఉపయోగకరంగా ఉంటాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు చేపట్టాలి..



పశుపోషకులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. నీటి కుంటలు నిర్మించడం, పశుగ్రాసాలను రాయితీపై అందించడం వంటి వాటిపై పాలకులు దృష్టి పెట్టాలి.

– మీసాల కన్నంనాయుడు, బాతువ

ఎక్కడి మురుగు అక్కడే..



పొన్నాడ ఎస్సీ కాలనీలో కొద్దిపాటి వర్షమొచ్చినా ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతోంది. డ్రైనేజీలు లేక నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

విరిసిన ‘మే’ పుష్పం



శ్రీకాకుళం నగరంలోని కొన్నావీధి రాధాకృష్ణనగర్‌లో గాయత్రి అపార్టుమెంట్ వద్ద ‘మే’ పుష్పం విరిసింది. భోగెల స్వాతి, లక్ష్మీ, సంగీత ఆధ్వర్యంలో ఇక్కడ పూలమొక్కలను పెంచుతున్నారు. మే నెలలో మాత్రమే పుష్పించే ఈ పుష్పాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

– శ్రీకాకుళం కల్చరల్

తలసేమియా బాధితులకు అండగా..



రక్తహీనతతో బాధపడుతున్న తలసేమియా బాధితులకు లావేరు మండలం చిన్న మురపాక యువకులు అండగా నిలిచారు. రెడ్‌క్రాస్‌లో రక్తం నిల్వలు లేనందున రెడ్‌క్రాస్ నిర్వాహకులు పెంకి చైతన్య పిలుపుమేరకు ఎస్‌వీవైస్ అధ్యక్షుడు బాలి శ్రీనివాసనాయుడు ఆధ్వర్యంలో వివేకానంద యూత్ సొసైటీ ప్రతినిధి ఇప్పిలి రాంబాబు జన్మదినం సందర్భంగా రక్తదానం నిర్వహించారు. రెడ్‌క్రాస్ ఆఫీస్‌కు వెళ్లి 19 మంది యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 2 టౌన్ ఎస్సై సంతోష్ కుమార్, మురపాక వార్డు సభ్యులు, ఎస్‌వీవైస్ సభ్యులు పాల్గొన్నారు.

– ఎచ్చెర్ల

ఇరువర్గాల దాడి.. కేసు నమోదు

శ్రీకాకుళం క్రైమ్ : బలగ పెట్రోల్ బంక్ సమీపంలో ద్విచక్ర వాహనంతో కాలు తొక్కిన ఘటన ఇరు వర్గాల మధ్య దాడికి దారి తీసింది. రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలో పెయింటింగ్ వర్క్ చేస్తున్న పలాసకు చెందిన బాలు అనే యువకుడు తన తల్లిదండ్రులు ఆసుపత్రికి వస్తుండటంతో బంక్ సమీపంలో వెయిట్ చేస్తున్నాడు. ఈలోగా పెద్దరెల్లివీధికి చెందిన షణ్ముఖ శ్రీను ద్విచక్ర వాహనంపై వస్తూ బాలు ముందు ఆగడంతో చక్రం కాలుకు తగిలింది. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి పరస్పరం దాడికి పాల్పడ్డారు. ఈలోగా పెద్దరెల్లివీధికి చెందిన మరో నలుగురు, పలాస బాలుకు చెందిన మరో ముగ్గురు అక్కడికి చేరి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. సమాచారం అందుకున్న సీఐ సంఘటనా స్థలికి చేరి ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించి రెండువైపులా కేసు నమోదు చేశారు.

ముంచెత్తిన వాన



ఆర్ట్స్ కాలేజీరోడ్డులో వర్షం నీరు

- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు
- నగరవాసులకు తప్పని తిప్పలు



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వర్షపు నీరు ఇలా..



ఆర్‌కేనగర్‌లో భారీగా చేరిన వర్షం నీరు



జలమయమైన హడ్కోకాలనీ రోడ్లు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)/శ్రీకాకుళం అర్బన్: రోజంతా ఎండ.. సాయంత్రం వరకు ఉక్కపోత.. 6.40 గంటల నుంచి 7.40 గంటల వరకు ఎడతెరిపిలేని వర్షం. ఇదీ జిల్లా కేంద్రంలో మంగళవారం పరిస్థితి. ఎడతెరిపి లేకుండా వాన కురవడంతో హడ్కోకాలనీ, ఫాజుల్‌బాగ్‌పేట, సీపన్నాయుడుపేట, గుజరాతిపేట, కృష్ణాపార్కు, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లల్లోకి నీరు వెళ్లిపోవడంతో వస్తువులన్నీ నీటమునిగాయి. పలుచోట్ల ఆస్పత్రులు, మందుషాపుల్లోకి సైతం నీరు చేరింది. అంబేడ్కర్ జంక్షన్, డే అండ్ నైట్ జంక్షన్, ఫారెస్ట ఆఫీస్ రోడ్డు, ఆదివారంపేట, కిన్నెర థియేటర్ రోడ్డు, సూర్యమహల్, సరస్వతిమహల్ కూడలిలో భారీ ఎత్తున నీరుచేరడంతో రాకపోకలకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సరిగ్గా ఇళ్లకు వెళ్లే సమయంలో గంట పాటు ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో భవన నిర్మాణ కార్మికులు, ఉద్యోగులు ఎక్కడికక్కడ ఉండిపోయారు. వర్షం ఆగిన తర్వాత కూడా నీరు రోడ్లపైనే ఉండిపోయింది. ఇటీవల కాలువల్లో పూడికలు తీస్తున్నా వర్షం నీరుమాత్రం ఎక్కడికక్కడ నిలిచిపోయి నగరవాసులకు కష్టాలు తప్పడం లేదు. లోతట్టు ప్రాంతాలు ఎత్తుచేసి కాలువల నుంచి మురుగునీరు సక్రమంగా ప్రవహిస్తేనే మురుగునీరు, వర్షం నీటి నుంచి ఉపశమనం లభిస్తుందని నగరవాసులు చెబుతున్నారు.



పాలకొండ రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్